నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం


మరమ్మతు చేయిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఘనాపూర్ పకీర్‌టెక్యా తండాలో చైర్‌పర్సన్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా హెచ్‌ఎండీఏకు సంబంధించిన నీటి సరఫరా పైపులైన్ లీకేజీ అవుతోందని, నీటి సమస్య ఉందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే మరమ్మతు పనులు చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నీటి సమస్య లేకుండా త్వరలో బోరు వేయిస్తామని, వార్డు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక ఉత్సవం



కీసర: నాగారంలోని రాక్‌వుడ్స్ పాఠశాలలో సాంస్కృతిక ఉత్సవం ఘనంగా సాగింది. ముఖ్య అతిథులుగా స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించి అతిథులను మైమరపింపజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వాలు తీసుకుంటున్నారు



కీసర: బీజేపీ సభ్యత్వం కోసం ప్రతి వార్డులో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వాలు తీసుకుంటున్నారని మేడ్చల్ జిల్లా బీజేపీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్ అన్నారు. గురువారం రాత్రి నాగారం మున్సిపల్ పరిధిలోని సువర్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీజేపీ సంస్థాగత ఎన్నికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిగా కష్టపడి కనీసం 100కు పైగా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. నాగారంలో పెద్ద ఎత్తున సుమారు 1500 వందల వరకు బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయించినందుకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డిని అభినందించారు. జిల్లాలో ముమ్ముందు బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేయడం జరుగుతుందని మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి తెలిపారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, బీజేపీ నేతలు అమరం మోహన్‌రెడ్డి, బోడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

కీసర: అహ్మద్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ. ఆర్‌జీకే ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఈడెన్‌గార్డెన్, ఆర్‌జీకే వై జంక్షన్, ఎస్‌జీఆర్‌కాలనీ, వీఆర్‌ఆర్‌పేస్ 1, 2, ఇందిరమ్మకాలనీ, కేఎల్‌ఆర్ వాటర్‌ప్లాంట్ బ్యాక్‌సైడ్, వీఆర్‌ఆర్‌హోమ్స్, పద్మజాఎన్‌క్లేవ్, సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌ఏరియా, లక్ష్మీగణపతి కాలనీ, సాయిశ్రీనివాస్‌కాలనీ, బాలజీనగర్, పల్లవీఇంటర్నేషనల్ స్కూల్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పోచారంలో..

పోచారం: విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు చేపట్టినందున శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్ ఫేస్ 1, 2, ఓయూ, యాదాద్రి, విజయపురి, బృందావన్ కాలనీలు, సదాశివనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: పట్టణంలోని సూర్యనగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు పట్టణంలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. పట్టణంలోని సూర్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, నవోదయ వెంచర్, మల్లికార్జున వెంచర్‌లలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

జవహర్‌నగర్‌లో..

విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా 33/11 కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ శివాజీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు సంతోష్‌నగర్, శివాజీనగర్, శ్రీరామ్‌నగర్, మహంకాళీ టెంపుల్ రోడ్డు, సుక్కమ్మకుంట, విఘ్నేశ్వర కాలనీ, కళ్యాణ్ సులోచన, వీకే.ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

నగదు, మద్యం బాటిళ్ల అపహరణ

మేడ్చల్‌రూరల్: అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి వైన్స్‌లో చొరబడి నగదుతో పాటు మద్యం బాటిళ్లు దోచుకెళ్లిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని రేణుకా ఎల్లమ్మ వైన్ షాప్‌ను యాజమానులు రోజులానే గురువారం రాత్రి షాపు మూసివేసి వెళ్లారు. అర్ధరాత్రి వైన్స్‌లోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తి షాపులో ఉన్న రూ.8 వేల నగదుతో పాటు మద్యం బాటిళ్లను దోచుకుని పరారయ్యాడు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదవ్వడంతో.. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



క్యూలైన్లలో బారులు తీరిన భక్తజనం




పూడూర్ ఆలయంలో..

కీసరగుట్టలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



అంతటా కార్తీక శోభ

భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు — 'శివనామస్మరణ'తో మార్మోగిన ఆలయాలు — స్వామివారికి నానావిధపుష్పార్చన, అభిషేకాలు — భక్తజనంతో కిటకిటలాడిన దేవాలయాలు


స్వామివారి అభిషేక పూజలో భక్తులు, అర్చకులు

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానంకు శుక్రవారం కార్తీకశోభ సంతరించుకుంది. కార్తీకమాసంలో విశిష్టమైన రోజు కార్తీక పౌర్ణమి కావడంతో స్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు చేరుకుని క్యూలైన్లలో బారులుతీరారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలను అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం భక్తులు యాగశాల మండపం వద్ద కార్తీకదీపాలు వెలిగించడంతో పాటు, కీసరగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం పరిసరాల్లో ఉన్న శివలింగాలకు పాలు, పెరుగు తదితర పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. గర్భాలయ అభిషేకాల్లో సైతం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాగ కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకోవడం, దీపారాధన చేయడం వల్ల కలిగే శుభ ఫలితాలను అర్చకులు భక్తులకు వివరించారు.

కన్నుల పండువగా జ్వాలా తోరణం, మహాలింగ దీపోత్సవం


◆ కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం కీసరగుట్టలో సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణం, మహాలింగ దీపోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కీసర సీఐ. వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తజనం


ఘట్‌కేసర్ స్వయంబూ నాగలింగేశ్వర లింగాల కుంటలో దీపోత్సవం

పెద్ద ఎత్తున సత్యనారాయణ వత్రాలు

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పెద్ద ఎత్తున సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు చీర్యాల దేవాలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో నిర్వహించిన సత్యనారాయణ వత్రాల్లో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో పూజా సామాగ్రిని అందజేశారు. కార్తీకమాసం పౌర్ణమి రోజున సత్యనారాయణ స్వామి వత్రంలో పాల్గొనడం వల్ల కలిగే శుభఫలితాలను అర్చకులు భక్తులకు వివరిస్తూ సత్యనారాయణ వత్రాలను కొనసాగించారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కార్తీక పౌర్ణమి

మేడ్చల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పండగ వాతావరణం కనిపించింది. మేడ్చల్, మున్సిపాలిటీలోని ఆలయాల్లో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో ఉదయం తులసి కోటలకు, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో దీపార్చన కార్యక్రమాలు నిర్వహించడం, శివాలయాల్లో శివుడికి అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉసిరికాయలలో, మట్టి దీపాలలో జ్యోతులను వెలగించారు.

ఆలయాల్లో లక్ష దీపార్చన..

మేడ్చల్ పట్టణంలోని రామలింగేశ్వర ఆలయం, సాయిబాబా ఆలయం, శివాలయం, కేఎల్‌ఆర్ శివాలయం, గడిమైసమ్మ ఆలయాల్లో లక్ష దీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అత్వెల్లి వెంకటేశ్వర ఆలయ ఆవరణలో గల శివాలయంలో కౌన్సిలర్ సరితా మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కోటి వత్తులతో 120 కేజీల నెయ్యితో దీపం వెలిగించి దీపోత్సవంను వైభవంగా నిర్వహించారు. మరోవైపు అత్వెల్లి శివాలయంలో మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


పూజల్లో కాంగ్రెస్ నేతలు

కన్నుల పండువగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శివారెడ్డిగూడ శివాలయం, లింగాలకుంట, అంకుషాపూర్, ఎదులాబాద్ శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, తులసి అర్చన తదితర పూజలు చేశారు. ఆలయ ధ్వజస్తంభాల ఎదుట కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ పూజారి వరదాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఇళ్ల ముందర బాణాసంచాకాల్చారు.


ఘట్‌కేసర్‌లో.. కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తజనం


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చీర్యాల ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి మహాదీపం


కార్తీక పౌర్ణమి మహాదీపం వెలిగిస్తున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, తదితరులు


కీసర: కార్తీక పౌర్ణమి సందర్భంగా చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీకపౌర్ణమి మహాదీపంను ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ వెలిగించారు. ఆలయ పండితులు కార్తీక పౌర్ణమి మహాదీపం విశిష్టతను భక్తులకు వివరించారు.


గడి మైసమ్మ ఆలయంలో దీపార్చన


లింగరూపంలో దీపాలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మేడ్చల్‌రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాలలో మహాశివుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. లింగమయ్యకు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని రామాలయంలో లక్ష దీపార్చన కార్యక్రమం నిర్వహించారు.


ఆలయంలో దీపం వెలిగిస్తున్న చిన్నారి



అత్వెల్లి ఆలయంలో ఆకాశ దీపం వెలిగిస్తున్న భక్తులు


గుండ్లపోచంపల్లిలోని.. కార్తీకదీపాలు వెలిగిస్తున్న కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, భక్తులు

కార్తీక పౌర్ణమి వెలుగుల్లో కీసరగుట్ట గోపురం








పూడూర్ శివాలయంలో భక్తుల రద్దీ

102 అమ్మఒడి వాహనాలను వినియోగించుకోండి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గర్భిణీ మహిళలు 102 అమ్మఒడి వాహనాలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్. రఘునాథ్ స్వామి తెలిపారు. అక్టోబర్ నెలలో 102 అమ్మఒడి వాహనాల ద్వారా సేవలను పొందిన గర్భిణీ మహిళల జాబితాను డీఎంహెచ్‌ఓకు అందజేసినట్లు 108 వాహనాల పోగ్రామ్ మేనేజర్ షేక్‌జాన్‌షాహిద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రెగ్నెన్సీ మహిళలు వైద్య పరీక్షల నిమిత్తం ఇంటి నుంచి ఆసుపత్రులకు అక్కడి నుంచి మళ్లీ ఇంటికి చేరడానికి ఉచిత రవాణా సౌకర్యం కోసం 102 అమ్మఒడి వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు ఈ సమచారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 108 వాహనాల జిల్లా సమన్వయ కర్త విజేందర్ పాల్గొన్నారు. ఇందులో 102 వాహనాల పనితీరుపై డీఎంహెచ్‌ఓ రఘునాథ్ సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఘనంగా ఆర్టీసీ మర్యాద దినోత్సవం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ బస్ ప్రయాణ ప్రాంగణంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు చెంగిచెర్ల ఆర్టీసీ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ లక్ష్మీ గులాబీ పూలు అందజేశారు.



వ్యక్తి అదృశ్యం

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా ఎల్లారెడ్డిగూడలో నివసించే సంగ సంతోష్ (32), భార్య నవనీత, కుమారుడు, అత్తమామలతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 13న తన దుస్తులు సర్దుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిన సంతోష్ ఇంతవరకు తిరిగి రాలేదు. సంతోష్ పనిచేసే దుకాణానికి వెళ్లి ఉంటాడని యజమానికి సంప్రదించగా అతను 7వ తేదీ నుంచి షాపుకు రావడం లేదని తెలిపారు. దీంతో అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


సంతోష్ (ఫైల్)

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్(ఇసీఐఎల్)లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్(డీఎంఎస్‌ఓటీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులలో ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత అవసరమన్నారు. కోర్సుల కాలవ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుందని, ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21 సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం కుత్బుల్లాపూర్ (ఇసీఐఎల్) ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని డాక్టర్ రఘునాథ్ స్వామి సూచించారు.